ప్రజాశక్తి

సోమవారం 17 జూన్ 2024 5

శ్రీ సత్యసాయి



బక్రీద్ ప్రార్థనలకు ఈద్గా మైదానాలు సిద్ధం

ప్రజాశక్తి-హిందూపురం

ముస్లింల ప్రధాన పండుగల్లో బక్రీద్ ఒకటి. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈద్-ఉల్-హజ అని కూడా పిలుస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిర్ హిజ్జ. ఈ నెల 10వ రోజు ముస్లింలు ప్రపంచ వ్యాప్తంగా బక్రీద్ జరుపుకొంటారు. అల్లాహ్ ఆజ్ఞను తూచా తప్పకుండా పాటించడమే ఈ పండుగ అర్థం. నేడు బక్రీద్ జరుపుకోవాలని మత పెద్దలు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు ఆచరిస్తారు. పట్టణంలోని అన్ని మదరసాలు, మసీదులు, ఈద్గాలు మైదానాల్లో ఉదయం 6.15 నుంచి 10 గంటల వరకూ ప్రత్యేక ప్రార్థనలను ఆచరిస్తున్నారు. ప్రతి ముస్లిం జీవిత కాలంలో కనీసం ఒకసారి తప్పనిసరిగా హజ్ చేయాలని నూరాల్లా జామియా మసీదు ముతవల్లి తెలిపారు.



ప్రార్థనలకు సిద్ధం చేసిన ఆల్ఇలాల్ మైదానం

అమాత్యా.. పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కించేరా..?



నేడు జిల్లాకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల
ఘన స్వాగతానికి టిటిపి శ్రేణులు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆర్థిక శాఖ మంత్రి అయ్యాక పయ్యావుల కేశవ్ తొలిసారిగా జిల్లాకు రానున్నారు. సోమవారం ఆయన రాక కోసం తెలుగుదేశం శ్రేణులు, ఆయన అభిమానులు పెద్దఎత్తునే స్వాగత ఏర్పాట్లు చేపట్టారు. చాలాకాలం తరువాత ఆయనకు ఈ కీలకమైన మంత్రి పదవి దక్కింది. అది కూడా ఆర్థిక శాఖయే కావడంతో జిల్లా అభివృద్ధి ఏ రకంగా పరుగులు పెట్టించగలరన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే జిల్లా సమస్యల పట్ల పూర్తి స్థాయి అవగాహన ఆయనకుంది. దీంతో ప్రధానంగా నిత్యం కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి వనరులపై దృష్టి సారిస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉంది. ఐదేళ్లుగా ప్రాజెక్టులన్నీ పెండింగులో ఉన్నాయి. ప్రధానంగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోనే పెండింగులో ఉండటం గమనార్హం. హంద్రీనీవా మొదటి దశ కింద ఆయకట్టుకు నీటిని అందించేందుకు వీలున్నది ఉరవకొండ నియోజకవర్గంలోనే. 2012వ సంవత్సరం నుంచి హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీరొస్తున్నా ఆయకట్టుకు నీటిని అందించే పంట కాలువల నిర్మాణం పనులు పూర్తవలేదు. అవి పెండింగులో ఉంటూ వస్తున్నాయి. దీంతో నీరు కళ్లముందు పోతున్నా ఉరవకొండ నియోజకవర్గంలోని రైతులకు మాత్రం ఆయకట్టుకు నీరందటం లేదు. ఇక రూ.850 కోట్లతో చేపట్టిన సామూహిక బిందు, తుంపెర సేద్యం ప్రాజెక్టు అటకెక్కి ఐదేళ్లవుతోంది. టెండర్ల పున:పరిశీలనలోనే కాలమంతా గడిచిపోయింది. ఇది పూర్తయింటే సుమారు 50 వేల ఎకరాలకు సామూహిక బిందు, తుంపెర సేద్యం ద్వారా నీటిని అందించే వీలుండేది. ఇకపోతే జిల్లాలో భైరవాని తిప్ప ప్రాజెక్టు, పేరూరు ఎత్తిపోతల పథకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. భూసేకరణ ఇప్పటికీ పూర్తవలేదు. దీంతోపాటు జిల్లాకు ప్రధానంగా సాగునీటిని అందిస్తున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది.తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేసిన ప్రతీసారి ఎక్కడో ఒకచోట గండిపడటం నీరు వృధాగా పోవడం జరుగుతూనే ఉంటోంది. దీని ఆధునీకరణ పూర్తి చేయాల్సి ఉంది. పిఎబిఆర్ డ్యామ్ లీకేజీలతో పూర్తి స్థాయి సామర్థ్యంతో నింపలేని పరిస్థితి ఉంది. జీయోమెమ్బ్రైన్ పద్ధతులలో మరమ్మతులు చేపడితే పూర్తి స్థాయి సామర్థ్యంతో నింపే వీలుంటుంది. దీంతోపాటు జిల్లాలో పరిశ్రమలేవి లేవు. కియా పరిశ్రమ గత టిడిపి ప్రభుత్వ హయాంలో వచ్చింది. అది సత్యసాయి జిల్లాలో ఉంది. అనంతపురం జిల్లాలో తాడిపత్రి ప్రాంతంలో మినహా ఎక్కడా పెద్ద పరిశ్రమలన్నవి లేవు. అపారమైన ఖనిజ సంపద ఇక్కడున్నా వాటి ఆధారిత పరిశ్రమలు రావడం లేదు. ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్ ఈ ప్రధానమైన సమస్యలకు పరిష్కారాలను ఏ మేరకు తీసుకురాగలరోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. అందులోనూ కీలకమైన శాఖకు ఆయన మంత్రిగా ఉండటంతో ఆయన మార్కు జిల్లాలో చూపే ప్రయత్నం చేస్తారని ఆశిస్తున్నారు.



అధ్వానంగా ఉన్న హెచ్ఎల్సి



భైరవాని తిప్ప ప్రాజెక్టు

ప్రశాంతంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలు

52.09 శాతం హాజరు
కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో ఉదయం మధ్యాహ్నం రెండు సెక్షన్ల కింద పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 2795 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1456 మంది హాజరుకాగా 1339 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1462 మంది హాజరు కాగా 1333 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1456 మంది హాజరు కాగా 1339 ముందుగా హాజరయ్యారు. మొత్తం 52.09 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. అనంతపురం జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ పరిశీలించారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలను జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. మధ్యాహ్నం నిర్వహించిన కెఎస్ఎన్ డిగ్రీ బాలికల కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. అంతకు మునుపు జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌ను కలెక్టర్ తనిఖీ తనిఖీ చేసి సివిల్ సర్వీసెస్ పరీక్షల బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. బుకింగ్ ప్రక్రియను పక్కగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, భూగర్భ జల శాఖ డిడి తిప్పే స్వామి, హెడ్ పోస్ట్‌మాస్టర్ బాల కుమార్, హెచ్ఎల్సి ఎస్సీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'అనంత' మేయర్‌కు అరుదైన అవకాశం

21న రష్యాలో జరిగే బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు ఆహ్వానం

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీంకు అరుదైన అవకాశం లభించింది. ఈనెల 21వ తేదీన రష్యాలోని జరిగే వివిధ దేశాలకు సంబంధించిన మేయర్లతో బ్రిక్స్ దేశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు అనంతపురం మేయర్‌కు ఆహ్వానం అందింది. ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా మేయర్లు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం అనంతపురం నగర మేయర్‌కు మాత్రమే ఈ సదస్సులో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. రాను పోను ప్రయాణంతో పాటు అక్కడ బస చేయడానికి ఇతర అన్ని సౌకర్యాలను రష్యా ప్రభుత్వమే భరించనుంది.

అనంత నగర మేయర్ కే అవకాశం ఎందుకంటే..

అనంతపురానికి రష్యాతో ఉన్న చారిత్రాత్మక అనుబంధం వల్లే అనంతపురం నగరాన్ని ఎంపిక చేశారు. 16వ శతాబ్దంలో ప్రథమ రష్యన్ యాత్రికుడు అఫానసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైన అనంతపురాన్ని సందర్శించాడు. ఈ సందర్శనకు సంబంధించినటువంటి అంశాల ప్రాధాన్యతను ఇటీవల కజాన్‌లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో గుర్తించారు. అందుకే భారతదేశం నుంచి పింక్ సిటీగా గుర్తింపు పొందిన జైపూర్, క్యాలీకట్,త్రిశూర్, నాగర్ కోయిల్‌తో పాటు అనంతపురం నగరాన్ని ప్రాతిపదికన తీసుకొని నగర ప్రథమ పౌరుడు అయిన మేయర్‌కు ఆహ్వానం పంపారు. ఎప్పుడో 16వ శతాబ్దంలో అనంతపురాన్ని సందర్శించిన రష్యన్ యాత్రికుని రచనలను పరిగణలోకి తీసుకొని అనంతపురం నగరాన్ని ఎంపిక చేయడం గర్వకారణంగా చెప్పుకోవచ్చు. ఇలాంటి అవకాశాల వల్ల చిరకాల సంబంధాలకు, సంస్కృతి, సాంప్రదాయాల మేళవింపులకు మరింత అవకాశం ఏర్పడుతుంది. రష్యాలో జరిగే సమావేశానికి అనంతపురం నుంచి మేయర్ వెళుతుండడంతో అంతర్జాతీయ స్థాయిలో అనంతపురం నగరానికి గుర్తింపు లభించినట్లైంది. రష్యన్ ప్రభుత్వం అనంతపురం నగరాన్ని గుర్తించిందంటే నగరంలోని ప్రజలు అందరి విజయంగా దీన్ని భావిస్తున్నానని మేయర్ వసీం తెలియజేశారు. ఈ సదస్సులో పాల్గొనడానికి తనకు అవకాశం దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు.



జెఎన్‌టియు ప్రొఫెసర్లకు జాతీయస్థాయి అవార్డులు

అభినందించిన వీసీ





జాతీయస్థాయి అవార్డులకు ఎంపికైన ప్రొఫెసర్లు ఈశ్వరరెడ్డి, చిత్ర

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుకు చెందిన ప్రొఫెసర్లను జాతీయస్థాయి అవార్డులు వరించాయి. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) జాతీయ స్థాయి 2023 అవార్డులకు అనంతపురం జేఎన్టీయూ ప్రొఫెసర్లు బి. ఈశ్వర్ రెడ్డి, విబి. చిత్ర ఎంపికయ్యారని అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య జివిఆర్. శ్రీనివాస రావు తెలిపారు. ఈ అవార్డులను ఈనెల 26న భువనేశ్వర్‌లోని కలింగ ఇన్స్టిట్యూట్ అఫ్ సోషియల్ సైన్సెస్, కలింగ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్) ఆధ్వర్యంలో జరిగే 53వ ఐఎస్‌టిఇ జాతీయ స్థాయి వార్షిక ఫ్యాకల్టీ సమావేశంలో వీరు అందుకోనున్నట్లు చెప్పారు. ఆచార్య బి. ఈశ్వర్ రెడ్డి అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు ఆచార్యులుగా, వర్శిటీ రీసెర్చ్, డెవలప్ మెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. ఈయన యూనివర్సిటీ నేషనల్ అవార్డ్ ఫర్ ది అవుట్ స్టాండింగ్ అకాడమిక్ టీచర్ క్యాటగిరిలో అవార్డును అందుకోనున్నారు. అదే విధంగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఇంగ్లీష్ ఆచార్యులు విబి. చిత్ర వర్శిటీ ఉమెన్ ఎంపవర్ మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె యూజీ విద్యాబోధనలో జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా అధ్యాపకులుగా మహమ్మద్ యూనిస్ మెమోరియల్ సంస్థ అందించే అవార్డుకు ఎంపిక అయినట్లు వీసీ తెలిపారు.ఈ అవార్డులు అందుకోనున్న ఆచార్యులను వీసీ ఆచార్య జివిఆర్. శ్రీనివాస రావు, రెక్టార్ ఆచార్య ఎం. విజయ కుమార్ , రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ అభినందించారు.

కదిరిని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఆత్మీయసమావేశంలో ఎమ్మెల్యే 'కందికుంట'

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణ సమీపంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశాన్ని ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు 20వేల మంది దాకా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఉద్యోగ పారిశ్రామికపరంగా మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. అధికారమంటే చెలాయింపు కాదని ప్రజలు ఇచ్చిన అవకాశమని అన్నారు. ప్రజలకు మంచి చేస్తేనే భవిష్యత్తు ఉంటుందని భవిష్యత్తులో వారు మనల్ని ఎప్పుడూ ఆదరిస్తారని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడిన వారందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. కదిరిలో మతాలను అడ్డం పెట్టుకొని రాజకీయాలను శాసించాలని చూసిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రజల్లో చంద్రబాబుపై ఉన్న విశ్వాసాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధి కూటమి అజెండా అని అన్నారు. తన ముందు అనేక కర్తవ్యాలు ఉన్నాయని వాటిని నెరవేర్చు బాధ్యత ప్రజలు తనకి ఇచ్చారని వాటన్నిటిని నెరవేర్చి అభివృద్ధి సంక్షేమం ప్రజలకు చూపిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, పిసి భైరవ ప్రసాద్, మంచి శివశంకర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి టీవీ పవన్ కుమార్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ భాను, కౌన్సిలర్లు, టిడిపి మండల కన్వీనర్లు, చెన్నకేశవులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

అమాత్యురాలిపై అభివృద్ధి ఆశలు

చారిత్రక పెనుకొండలో సమస్యల సవాళ్లు
పర్యాటక, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత పెరిగేనా?
మంత్రి సవితకు స్వాగతిస్తున్న సమస్యలు





పెనుకొండ ముఖద్వారం

పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీసీ సంక్షేమ శాఖ మంత్రి అయిన సవితకు నియోజకవర్గ సమస్యలు పెనుసవాల్‌గా మారాయి. ప్రధానంగా పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగకల్పన, ప్రతిచెరువుకు నీరివ్వడం, పర్యాటక అభివృద్ధి, రాయల ఉత్సవాలు, పెనుకొండ కొండపై ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం వంటి అభివృద్ధి కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తాగు, సాగు నీటికోసం అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. రెండు దశాబ్ధాలుగా చెరువుల కింద సాగు చతికిలపడింది. ఉపాధి కోసం వలసలే శరణ్యమయ్యాయి. పెనుకొండ పర్యాటక, పారిశ్రామికాభివృద్ధి, పెనుకొండ కొండపై దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం పూర్తైయితే వందలాది మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశాలున్నాయి. నిరుపేదలకు ఇంటి పట్టాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, నియోజకవర్గంలో ఇంటింటికి తాగునీరు, సూపర్‌సిక్స్ పథకాల అమలు తదితర సమస్యలు నెరవేరుస్తారని ఎమ్మెల్యే, మంత్రి సవితపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు.

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

రాయల ఉత్సవాలను మరచిన గత ప్రభుత్వం

2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాయల పంచశతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించింది. అప్పటి నుంచి ఏటా రాయల ఉత్సవాలు ప్రభుత్వం నిర్వహించేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయల ఉత్సవాల ఊసే లేదు. స్థానిక ప్రజలు ప్రతి ఏటా ఆగస్టు నెలలో ఉత్సవాలు నిర్వహిస్తారని ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం రాయల ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించనే లేదు. ప్రస్తుత తెలుగుదేశం అధికారం చేపట్టింది. ఇప్పుడైన రాయల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారని ప్రజలు ఆశగా ఉన్నారు.

పర్యాటక అభివృద్ధి జరిగేనా?

విజయనగర రాజుల రెండో రాజధాని పెనుకొండ చారిత్రక సంపద, కట్టడాలకు నిలయం. పర్యాటక అభివృద్ధికి 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పంచశతాబ్ది ఉత్సవాల సందర్భంగా పలు హామీలిచ్చింది. ప్రధానంగా కొండ రోడ్డు నిర్మాణం, కొండపైన శిథిలమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, అతిథిగృహాల నిర్మాణం వంటి పనులు చేపట్టి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ప్రస్తుతం కొండపైకి రోడ్డు నిర్మాణం పూర్తిఅయింది. ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. పట్టణంలో పలు చారిత్రిక కట్టడాలు ఆక్రమణల చెరలో ఉన్నాయి. వీటన్నింటిని అభివృద్ధి చేసి పెనుకొండకు పర్యాటక గుర్తింపు తీసుకురావాల్సి ఉంది. కియా కార్ల పరిశ్రమతో పెనుకొండకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో పర్యాటక , పారిశ్రామిక అభివృద్ధికి మంత్రి సవిత కృషి చేయాలి.

చుట్టూ పరిశ్రమలున్నా యువతకు ఉపాధికరువు

దక్షిణ కొరియా కార్ల దిగ్గజం కియా కార్ల పరిశ్రమ జిల్లాకు వరం. ఈ నేపథ్యంలో జిల్లాలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఆశలు పెట్టుకుంది. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా 13 వేల మందికి ఉద్యోగావకాలు లభిస్తాయని ప్రభుత్వ ఒప్పందంలో కియా స్పష్టం చేసింది. అదే విధంగా కియా అనుబంధ సంస్థల్లో దాదాపు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. ఉపాధి అవకాశాల కోసం వేలాది మంది నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. ఉద్యోగ నియామకాల్లో తొలి ప్రాధాన్యత జిల్లావాసులకే అంటున్నా సింహభాగం తమిళులే ఉన్నారు. భూములిచ్చిన కొందరు రైతులకు ఇప్పటికి ఉద్యోగ అవకాశాలు లభించలేదు.

హంద్రీనీవా పథకమే శరణ్యం

హంద్రీనీవా పథకంలో భాగంగా పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు అందించాలని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ముందడుగు వేసింది. గోరంట్ల మినహా పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండలాలకు అనుసంధానంగా నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. అయితే వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చెరువులు నింపే ప్రక్రియ చేపట్టలేదు. చెంతనే రిజర్వాయర్ ఉన్నా నేటికీ అనేక చెరువులకు నీరు అందని పరిస్థితి. రొద్దం, పెనుకొండ, సోమందేపల్లిల్లో కొన్ని చెరువులకు మాత్రమే నీరు అందుతోంది. గోరంట్లకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇచ్చే అవకాశం ఉంది.పెనుకొండ పట్టణంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. పెనుకొండ కొండ వెనుక నుంచి హంద్రీనీవా కాలువ వెళ్లుతున్నా పట్టణానికి తాగునీటి సమస్య తీరలేదు. ఒక లిఫ్టు ఏర్పాటు చేస్తే పెనుకొండ చెరువుకు కృష్ణా జలాలు వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్యపై మంత్రి దృష్టి సారించాల్సి ఉంది.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం: మంత్రి సవిత


నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తెలుగుదేశం హయాంలోనే నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధిలో దూసుకు పోయిందన్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని మంత్రి వివరించారు.

నియోజవకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలు

- పట్టణ ప్రభుత్వాస్పత్రిలో ట్రామాకేర్, సీమాక్ సెంటర్లు ప్రారంభం. ఆస్పత్రి స్థాయి, సిబ్బంది పెంపు.
- పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, పరిగిలో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటు
- కియా పరిశ్రమ వద్ద ఆర్వోబి నిర్మాణం త్వరిగతిన చేపట్టడం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల్లో లెక్చరర్ల కొరత,
- సోమందేపల్లిలో జూనియర్ కళాశాల, పెనుకొండలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు.
- పెనుకొండలో నిరుద్యోగ యువతకు నైపుణాభివృద్ధి శిక్షణా కేంద్రాల ఏర్పాటు.
- నియోజకవర్గంలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం, గ్రామాల్లో ప్రధాన, లింకు రోడ్ల నిర్మాణం.
- అర్హులైన నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం.
- నగరపంచాయతీ పరిధిలో అండర్ డ్రైనేజీ వ్యవస్థఏర్పాటు



గగన్‌మహల్



కొండపై శిథిలమైన శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయం.



కియా కార్ల పరిశ్రమ

ఎన్‌డిఏ పాలనలో అభివృద్ధి ఏంటో చూపిస్తాం

క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం
వైసిపి పాలనలోని అక్రమాలు వెలికి తీస్తాం
మంత్రి సత్యకుమార్ యాదవ్
వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎన్డీఏ పాలనలో అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం అమరావతిలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో చేసిన అక్రమాలు, దౌర్జన్యాలు, భూదందాలను వెలికి తీసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని 5.3 కోట్ల మంది ప్రజలకు కార్పొరేట్ వైద్యానికి దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాన్ని అందించే బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పాలన ఎలా ఉంటుందో వైసిపికి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు ఫైలుపై సంతకం చేశారని, దీని ద్వారా క్యాన్సర రకాలను గుర్తించి మ్యాపింగ్ చేయడమే కాకుండా శిక్షణ కూడా ఇప్పిస్తామన్నారు. శిక్షణ తీసుకున్న వారి ద్వారా పట్టణం నుంచి గ్రామాలకు వెళ్లి క్యాన్సర్ బాధితులను గుర్తించడం, అవగాహన కల్పించడంతో పాటు నివారణ చర్యలు చేపట్టి వైద్యం అందిస్తామన్నారు. రాష్ట్రాన్ని క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా తీసుకుపోయేలా సిఎం చంద్రబాబు నాయకత్వంలో కలిసి ముందుకు సాగుతామన్నారు. సిఎం చంద్రబాబు, కేంద్రంలోని పెద్దల ఆశీస్సులతో తనకు అతిపెద్ద పదవి కట్టబెట్టారని బాగా పని చేసి వారి నమ్మకాన్ని నిలబెడగానన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించి వారి ఆరోగ్యమే పరమావధిగా పని చేస్తానన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : డిఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి విద్యార్థి నూతన సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి(డిఇఒ) మీనాక్షి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా గతేడాది పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన ఉప్పర (సగర) విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో హిందూపురం డివిజన్ శ్రీభగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదినారాయణ అధ్యక్షతన ప్రోత్సాహక బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిఇఒ మీనాక్షి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యకు మించిన సంపద లేదని, విద్యతో దేనినైనా సాధించవచ్చన్నారు. నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులు, గురువులు, సమాజంలోని పెద్దలను గౌరవించాలన్నారు. విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించి సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో



విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

అనంతపురం ఉప్పర సంఘం అధ్యక్షులు నాగముని, విశ్రాంత ఎస్ఐ నాగరాజు, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, ఈశ్వరరెడ్డి, మహంతేష్, రాజశేఖర్, కార్యదర్శి ఎల్ఐసి వెంకటేశులు, ట్రెజరర్ పైడేటి రామాంజనేయులు, కిష్టప్ప, నాగప్ప, జాయింట్ సెక్రటరీ శ్రీరాములు, నాగముని, నాగరాజు, నర్సింహారెడ్డి, ఈశ్వరప్ప, తిమ్మగానిపల్లి రామస్వామి, టీచర్ అశ్వర్థప్ప, గోపాల్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, డివిజన్ పరిధిలోని సగర ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానం ఆవరణలో ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఆధ్వర్యంలో విద్యా గణపతి సన్నిధిలో ఆదివారం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కదిరి జోగి శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కోడూరు శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పురోహితులు సురేష్‌శర్మ విద్యా గణపతి విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహించి, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం 186 మంది చిన్నారులకు దాత కోడూరు శ్రీకాంత్ పలక, బలపాలు అందజేశారు. శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిటీ కేబుల్ జర్నలిస్ట్ నాగేష్(కదిరి), టైలర్ నిజాం, జిరాక్స్ అశోక్, ట్రాన్స్‌కో రవి, సీసీ కెమెరా శంకర్, డబురువారిపల్లి రమేష్, రవి, గణేష్, మధు, భాస్కర్‌రెడ్డి, ఎస్బిఐ శీన, ఆనంద్, మల్లెల రమేష్, గణేష్, సందీప్ పాల్గొన్నారు



చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన

అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం హెడ్ కానిస్టేబుల్ గౌడ్ సహకారంతో కాలజ్ఞాని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ పుణ్య దంపతుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని పురోహితులు పంచరత్న సురేష్‌శర్మ వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ ఫకృద్దీన్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పచ్చార్ల ఆంజనేయులునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు సీసీ కెమెరా శంకర, ఆనంద్, ఎస్బిఐ శీన, గణేష్, బంగారు దుకాణం శంకరాచారి, స్టీల్ షాప్ శేఖర్, పూజారి రమణ, సందీప్, ట్రాన్స్‌కో రవి, మల్లెల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి, సామరస్యం వెల్లివిరిసేలా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ పర్వదినాన జిల్లా వ్యాపంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గోవధ చేయరాదన్నారు.

మంత్రులను కలిసిన నాయకులు

పుట్టపర్తి రూరల్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఆదివారం విజయవాడలో పుట్టపర్తి బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ రాష్ట్ర కల్లు గీత కార్మికుల సంఘం కన్వీనర్ హరికృష్ణగౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్రబాబు విజయవాడలో సచివాలయంలో మంత్రి వై.సత్యకుమార్‌ను కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టపర్తికి వంద పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని కోరారు.

రేపు వారపు సంత వేలం

ఓబుళదేవరచెరువు : ఒడిసి గ్రామపంచాయతీకి చెందిన వారపు సంత, బస్టాండ్ ఫీజు వసూలు చేసుకునే హక్కు పొందేందుకు ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి ఎం.గోవిందు అధ్యక్షతన మండల సెక్రటరీ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించనున్నారు. పంచాయతీకి ఎలాంటి బకాయిలు లేని వారు వేలంలో పాల్గొన వచ్చున్నా రు. వారపు సంతకి రూ. 50వేఆలు ధరవాత్తు, బస్టాండు ఫీజుకి రూ. 50వేలు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

18 నుంచి డిగ్రీ తరగతులు పున:ప్రారంభం

హిందూపురం : ఈ నెల 18వ తేదీ నుంచి డిగ్రీ మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు తరగతులు పున: ప్రారంభమవు తాయని పట్టణంలోని ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి ఆదివారం తెలిపారు. మొదటి సంవత్సరం డిగ్రీ బి.ఎ, బి.ఎస్సీ. బీ.కాం. కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థినులు పని దినాల్లో కళాశాలలో సంప్రదించవచ్చన్నారు. ఇంటర్ మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 3 పాస్ ఫొటోలు తీసుకురావాలన్నారు. విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం ఉందని ప్రిన్సిపల్ తెలిపారు.

తాగునీటి సమస్య తీర్చండి

మడకశిర : నగర పంచాయతీ పరిధి లోని 7వ వార్డు కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఉన్న బోరు చెడి పోవడంతో నీటి సమస్య తీవ్రమైందని స్థానికులు వాపోతు న్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ తలమర్ల సుబ్బ రాయుడు, బాబన్న, గంగాధర్, తనోజ్, మురళి, సంతోష్, లారా, కాలనీ యువకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధితో ఉపాధ్యాయుడి మృతి

కొత్తచెరువురూరల్ : మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు(55) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు ఏడాది నుంచి క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఈయన మండలంలోని ఎర్రబెల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసేవారన్నారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇతను మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు శ్రద్ధాంజలి ఘటించారు.

బాధిత కుటుంబాలకు 'గుండుమల' పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వివిధ కారణాలతో చనిపోయిన టిడిపి నాయకులు, కార్యకర్తల కుటుంబాలను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ, ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పరా మర్శించారు. వివరాలు.. అగళి మండలంలోని ఇరిగేపల్లిలో సీనియర్ నాయకుడు ముకుందప్ప అనారో గ్యంతో మృతిచెందగా గుండుమల ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రొళ్ల మండలంలోని పిల్లిగుండ్లు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రంగనాథప్ప కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి తృతీయ సంవత్సరం వైద్య విద్యనభ్యసిస్తుండేవాడు. కొన్ని రోజుల క్రితం కర్నూలు నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న గుండుమల

మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించాడు. అలాగే శ్రీనివాస్ తమ్ముడు తిమ్మప్ప కుటుంబాలను పరామర్శించారు. గుండుమల వెంట మండల కన్వీనర్ దాసిరెడ్డి, బిఎస్ గురుమూర్తి, జికె.ఈరన్న, జడ్పిటిసి ఉమేష్, ఇరిగేపల్లి శ్రీనివాస్, శివకుమార్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'మధుమేహం'పై అప్రమత్తంగా ఉండాలి

స్పందన హాస్పిటల్ డాక్టర్ బషీర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు మధుమేహం(చక్కెర వ్యాధి) పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణంలోని స్పందన ఆసుపత్రి అధినేత డాక్టర్ బషీర్, సతీమణి డాక్టర్ సోనియా సూచించా రు. 'జాతీయ మధుమేహ వ్యాధి వారోత్సవాలు' సందర్భంగా ఆదివారం వారు పలు విషయాలను వెల్లడించారు. మధుమేహం(షుగర్ వ్యాధి) వయ సుతో సంబంధం లేకుండా అందరికీ వస్తుందన్నా రు. రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించడం చాలా ముఖ్యమన్నారు. జీవన శైలిలో మార్పులు చేయాలని, వ్యాయామం, ఆటలు పరిమి తంగా చేయాలన్నారు. ఆహారం పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ప్రతినెలా వైద్యుడిని సంప్రదించాలని, బిపి చెక్ చేయించుకోవాలన్నారు. ఎక్కువ దప్పిక, ఎక్కువ ఆకలి, ఎక్కువ మూత్ర విసర్జన, బరువు తగ్గడం లక్షణాలు అని తెలిపారు. సాధారణంగా 45 ఏళ్లు పైబడిన వారిలో గాని, అంతకంటే చిన్నవయసులో కూడా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. మహిళలు గర్భం దాల్చిక ముందే డయాబెటిస్ ఉంటే, గర్భం రాక మునుపే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. మూత్రపిండాలు, కన్ను, రెటీనా, రక్తపోటు పరీక్షించుకోవాలన్నారు. రెటినోపతి పెరిగే అవకాశం ఉన్నందున తరచూ రెటీనా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

'చిలకం'కు కెజిబివి సిబ్బంది వినతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

'మా సమస్యను గత ప్రభుత్వం విస్మరించి మోసం చేసిందని, కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కెజిబివి ఉద్యోగులు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. కెజిబివి ఉద్యోగులు శంకరమ్మ, గీత, సువర్ణ, లక్ష్మీ ఆదివారం పట్టనంలోని జనసేన పార్టీ కార్యాలయంలో చిలకంను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2005 నుంచి 4,579 మంది కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్నామని, గత టిడిపి ప్రభుత్వంలో 2018లో మమ్మలను కెజిబివి స్టాఫ్‌లోకి వర్తింపజేయాలని జీఓ కూడా జారీ చేసిందన్నారు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మమ్మల్ని క్రమబద్ధీకరిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు.



చిలకం మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కెజిబివి ఉద్యోగులు

నూతన ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని భావించి మీ వద్దకు వచ్చామని చిలకంతో పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఆయన మీ సమస్యను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కోనంకి అశోక్‌కుమార్

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

రాష్ట్రంలో ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్ కోరారు. కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన ఎపిటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం చేకూర్చే జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు పరిచి ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులను కొనసాగించాలని, బోధన మాతృభాషలోనే కొనసాగించాలని, 6 నుంచి 10వ తరగతి వరకూ తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన కొనసాగించాలన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పివి.మాధవ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, ఆర్.చంద్ర మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించడంతో పాటు ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని, బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు లతా రామకృష్ణ, అంజనమూర్తి, బలరాం, రవీందర్‌రెడ్డి, నారాయణ, వెంకటనారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు గవ్వల రామకృష్ణ, పి.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ నాగభూషణ, చంద్రశేఖర్‌గౌడ్, గోపాల్‌నాయక్, రవికుమార్, హరిప్రసాద్, ఎల్.చంద్ర, సాయిశివ, ఆంజనేయులు, గోపాల్, సుధాకర్‌రెడ్డి, శంకర నారాయణ, శివానంద, వాసుకుమార్, అంజనమూర్తి, వెంకటరమణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటన హర్షణీయం : డిటిఎఫ్

ఓబుళదేవరచెరువు : టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రప్రథమంగా మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేయడం హర్షణీయమని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫుద్దీన్, జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ పేర్కొన్నారు. ఓబుళదేవరచెరువులో ఆదివారం వారు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. టిటిసి, బిఈడి పూర్తి చేసిన నిరుద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తుండగా చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటించడం శుభ పరిణామం అన్నారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెంచాలని, పాఠశాలల విలీనానికి కారణమైన జీవో 117ను రద్దు చేయాలని కోరారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహులు, సోమశేఖర్ మాట్లాడుతూ గతంలో తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంతో టెట్‌కు చాలా మంది హాజరు కాలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అత్యధిక పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించడంతో మరోసారి టెట్ నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. 'అమ్మకు వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 62కు పెంచాలని వారు కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-హిందూపురం

2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌తో పాటు ఉన్నత విద్యలో అత్యున్నత మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి వాల్మీకి హక్కుల ఉద్యమకారులు, విజయలక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపకు లు, రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం అధ్యక్షులు బంగారు క్రిష్ణమూర్తి, జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి శివయ్య, గౌరవాధ్యక్షులు పుట్ట కామప్ప హాజరయ్యారు. బంగారు క్రిష్ణమూర్తి మాట్లాడుతూ వాల్మీకి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. జీవితాలు బాగుపడాలన్న, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నా చదువు ఒక్కటే మార్గం అన్నారు. అనంతరం విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. బంగారు క్రిష్ణమూర్తిని స్థానిక



ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో సంఘం నాయకులు

నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగన్న, ఓబుళపతి, ఆకుల సూరి, మూర్తి, రాజు, ఆంజనేయులు, శివశంకర్, ఈశ్వరయ్య, శ్రీధర్, సూర్య నారాయణ, బంగారు లింగ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివన్న, ట్రెజరర్ రామకృష్ణ, ఎన్‌జిఒ సంఘం తాలూకా అధ్యక్షులు నరసింహులు, ఆదినారాయణప్ప, నారాయణస్వామి, జనార్ధన్, రవిశేఖర్, మల్లికార్జున, అశ్వర్థప్ప, సుదర్శన్, చంద్రశేఖర్, వెంకటేష్, సోమశేఖర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు అందిస్తాం : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రేషన్ కార్డుదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేస్తామని ఆర్డీఓ వెంకట శివరామి రెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ ఆదివారం ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ధర్మవరం, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి స్టాక్ పాయింట్లను సందర్శించి కందిపప్పు, నూనెను పరిశీలించారు. పంచదార నిల్వ రిజిస్టర్‌ను తనిఖీ చేసి వాటిని తూకాలు వేసి పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా హెచ్చు తగ్గులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్టాక్ పాయింట్ సిబ్బందిని ఆదేశించారు. ఆర్డీఓ వెంట అధికారులు లక్ష్మీదేవి, శారద, రమాదేవి, హంపయ్య, ఈశ్వరయ్య ఉన్నారు.



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి

క్రమశిక్షణ, నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

గ్రేట్ వే ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి

గోరంట్ల : క్రమశిక్షణ, నాణ్యమైన విద్యనందించడమే గ్రేట్ వే ఇంటర్నేషనల్ పాఠశాల లక్ష్యమని ప్రిన్సిపల్ కష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని పాలసముద్రం సమీపంలో హిందూపురంరోడ్డులో ఆహ్లాదకరమైన వాతావర ణంలో సువిశాలమైన ఆట స్థలంలో పాఠశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన తమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. హాస్టల్ వసతి ఉందని, అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన అందిస్తున్నామన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ ఎడ్యుకేషన్, హ్యాండ్ రైటింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం : మాజీ మంత్రి

గోరంట్ల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే కూటమి నాయకులు, కార్యకర్తలు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ వైసిపి శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి శంకరనారాయణ విమర్శించారు. మండలంలోని వానవోలు గ్రామపంచాయతీ ఉప సర్పంచి బాబు ఇంటిపై శనివారం రాత్రి అల్లరి మూకలు దాడి చేయడంతో ఆయన ఆదివారం బాబును పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే వైసిపి శ్రేణులు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయన్నారు. వైసిపి కార్యకర్తలు, నాయకులకు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసిపి కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు.

ఎమ్మెల్యే కందికుంటకు సన్మానం

కదిరి టౌన్ : కదిరి తాలూకా ఆర్.ఎం.పి, పి.ఎం.పి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ని పూలమాలలు, శాలువా ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కందికుంట విజయం సాధించడంతో ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.అల్లా బకాష్, డాక్టర్ బాబా ఖలందర్ కందికుంటకు గజమాల వేసి శాలువాలతో సన్మానించి మిఠాయిలు అందజేశారు. అలాగే సెక్రటరీ డాక్టర్ ఎస్ బాబ్‌జాన్, కోశాధికారి ఎస్.మహబూబ్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వేమారెడ్డి, గౌరవాధ్యక్షులు టి.ఆంజనేయులు, కమిటీ సభ్యులు పిఎల్ఎన్ రాజు, వై.సిద్ధారెడ్డి, టి.అంజాద్‌ఖాన్, వెంకటేష్‌నాయక్, ఆర్ఎంపి సంఘం సభ్యులు, వైద్యులు కందికుంటను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కందికుంటను సన్మానిస్తున్న ఆర్ఎంపి, పిఎంపిలు

మడకశిర ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

మడకశిర : మడకశిర పట్టణ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సీనియర్ పాత్రికేయులు డి.శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షులుగా హరీష్, ప్రధాన కార్యదర్శిగా హెచ్.గోవిందప్ప, ఉపాధ్యక్షులుగా ఇర్ఫాన్, నాగరాజు, కార్యదర్శిగా నాగరాజు, జాయింట్ సెక్రటరీగా పవన్‌కుమార్, ట్రెజరర్‌గా ఎస్.కృష్ణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎంపికకు సహకరించిన సీనియర్ పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రెస్ క్లబ్ కమిటీ అభివృద్ధికి కషి చేయాలనిసూచించారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు

ఉచిత మూర్ఛ వైద్య శిబిరానికి విశేష స్పందన

హిందూపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఓ సారి మూర్ఛవ్యాధిగ్రస్తుల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం పట్టణంలోని ఆర్పిజిటి రోడ్డులో ఉన్న అల్ హి లాల్ పాఠశాల ఆవరణలో (123వ మూర్ఛ వ్యాధి శిబిరాన్ని) నిర్వహించారు. వైద్యులు డా. ఇటి రామ్మూర్తి 129 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, 2 నెలలకు సరిపడా మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మూర్ఛ వ్యాధిపై అపోహాలు విడనాడి, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నియంత్రించవచ్చు అన్నారు. శిబిరంలో వైద్యులు జెవివి అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు గంగిరెడ్డి, అతావుల్లా, ఎం.రామకృష్ణ, సుబ్రమణ్య నాయక్, మంజునాథాచారి, విశ్వనాథాచారి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సేవలందించారు.

ఫ్లెక్సీలు చించడంపై జనసేన నిరసన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు దుండగులు చించేయడంతో వారికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పిండ ప్రదానం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం, ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి దక్కడంతో 9వ వార్డులో జనసేన పార్టీ నాయకుడు అడ్డగిరి శ్యాంకుమార్ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. దీనిని కొందరు దుండగులు చించేయగా శ్యామ్‌కుమార్ అర్చకుడిని పిలిపించి ఫ్లెక్సీని చించేసిన దుండగులకు పిండ ప్రదానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఎవరూ పాల్పడకుండా ఈ కార్యక్రమం చేపట్టినట్టు జనసేన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, దుర్గమ్మ, ముత్యాలప్ప, రామాంజి, సుధాకర్‌రెడ్డి, భవానీ శంకర్, తలారి ప్రతాప్, షఫీ, లక్ష్మీనారాయణ, అఖిల్, భగవాన్, రామ్‌చరణ్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.

విష సంస్కృతిని విడనాడాలి : టిడిపి

గోరంట్ల : పట్టణంలోని బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసిపి అల్లరి మూకలు చించి వేశారని ఆదివారం టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి మండల మాజీ కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మకు మంత్రి పదవి వచ్చిన శుభ సందర్భంగా నాలుగు రోజుల క్రితం బస్టాండ్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా వైసిపి అల్లరి మూకలు చించి వేశారని మండిపడ్డారు. ఇలాంటి సంస్కృతి తగదని సూచించారు. వైసిపి ప్రభుత్వంలో జర్నలిస్టులు, ముస్లింలు, టిడిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టడంతో పాటు దాడులు చేశారని, ఇలాంటి విష సంస్కృతి వైసిపి నాయకులకే చెల్లుతుందన్నారు. ఇకనైనా వైసిపి శ్రేణులు విష సంస్కృతికి స్వస్తి చెప్పాలని హితవు పలికారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.

మధ్యప్రదేశ్ సత్యసాయిభక్తుల పర్తియాత్ర

పుట్టపర్తి అర్బన్ : మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుమారు 2వేల మంది సత్యసాయి భక్తులు పర్తి యాత్రగా ఆదివారం ఉదయం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. వారు, బాల వికాస్ విద్యార్థులు సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకొని వారి సంప్రదాయ పద్ధతుల్లో భజనలు, కీర్తనలు ఆలపించారు. వారు మాట్లాడుతూ తాము ఏటా బాబా దర్శనానికి వస్తూ ఉంటామన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిసాయంత్రం సంగీత కచేరీతో పాటు బాబాపై భజన కీర్తనలు ఆలపించారు. అందరికీ ప్రసాదం పంపిణీ చేశారు.

ఎపిఎన్‌జిఒ సంఘం తాలూకా కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి

ధర్మవరం టౌన్ : ఎపిఎన్‌జిఒ సంఘం తాలూకా కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవం గా ఎంపిక చేసినట్టు ఆ సంఘం అధ్యక్షులు ఉరుకుందప్ప తెలిపారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం సభ్యులు భాస్కర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

జ్యోతుల ఊరేగింపు

గాండ్లపెంట : మండలంలోని మద్దివారిగొంది పంచాయతీలోని కమ్మతంపల్లిలో దళితవాడకు చెందిన ప్రజలు ఆదివారం మారెమ్మకు జ్యోతులు, బాణాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ ఏటా మహిళలు జ్యోతులు, బాణాలు ఊరేగింపుగా తీసుకెళ్లి మారెమ్మ ఆలయంలో సమర్పించి అమ్మవారికి పూజలు నిర్వహించడం, ప్రసాదాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సంవత్సరం సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండి మంచి దిగుబడి రావాలని కోరుకుంటున్నామని ప్రజలు తెలిపారు. ఊరేగింపులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఊరేగింపుగా జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు